సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీపీతోనే భవిష్యత్తు

వైఎస్సార్‌సీపీతోనే పేదవాడి భవిష్యత్తు సాధ్యమని రంపచోడవరం అసెంబ్లీ ఆ పార్టీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. 8లో



మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

8లో

మహిళా సంక్షేమానికి సీఎం పాధాన్యమిచ్చారని పాడేరు అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు అన్నారు.



శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి

శివారు గ్రామాలను అభివృద్ధి చేస్తామని అరకు ఎంపీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుమ్మా తనూజారాణి హామీ ఇచ్చారు. 8లో

న్యూస్‌రీల్

ఎన్నికల నిర్వహణపై పూర్తి అవగాహన తప్పనిసరి

• రంపచోడవరం ఆర్వో ప్రశాంత్‌కుమార్



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఆర్వో ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్. ప్రశాంత్ కుమార్ సూచించారు. శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సెక్టోరల్, రూట్ అధికారులకు ఈవీఎంలపై, వీవీ ప్యాడ్లపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 399 పోలింగ్ కేంద్రాలకు 59 మంది సెక్టోరల్, 73 మంది రూట్ అధికారులను నియమించామని చెప్పారు. వీరందరికీ పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నామన్నారు. సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీకి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కౌంటర్లు ఏర్పాటుచేస్తామన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

గూడెంకొత్తవీధి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టుల నుంచి ఎలాంటి ముప్పు లేకుండా ఉండేందుకు పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా శనివారం పోలీసు జాగిలాలు, బాంబు స్క్వాడ్ సాయంతో మెయిన్ రోడ్డులో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. వంతెనలను పరిశీలించారు.ఈ సందర్భంగా సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అప్పలసూరి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తనిఖీలు ముమ్మరం చేశామన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

• బాలసదనానికి బాలిక తరలింపు

పాడేరు: బాలికకు గుట్టుగా తలపెట్టిన వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. జిల్లా కేంద్రమైన పాడేరులో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పెదబయలు మండలం తర్లసింగికి చెందిన బాలిక (13) పాడేరు గిరిజన గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈమెకు గత మార్చి 29న వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు వివాహాన్ని నిలిపివేశారు. తల్లిదండ్రులు, ఇరువర్గాల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆతరువాత బాలికను పాడేరు గిరిజన గురుకుల పాఠశాలకు పంపించారు. వేసవి సెలవులు కావడంతో బాలిక ఇంటికి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు మళ్లీ ఆమెకు వివాహం చేసేందుకు సిద్ధపడ్డారు. ఈమేరకు ఆమెకు శనివారం తర్లసింగిలో పెదబయలు మండలం లింగేటి గ్రామానికి చెందిన వ్యక్తి (46)తో శనివారం వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు వివాహ వేదిక వద్దకు చేరుకున్నారు. వివాహాన్ని నిలిపివేసి బాలికను పాడేరులోని బాలసదనానికి తరలించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 9440933450 నంబరుకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.



• ప్రజాసంక్షేమానికి పెద్దపీట
• వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం

జగనన్న మేనిఫెస్టో ప్రత్యక్ష ప్రసారాన్ని అరకులో టీవీలో చూస్తున్న కుటుంబ సభ్యులు

మా నమ్మకం నువ్వే జగన్

మేనిఫెస్టోతో ప్రజలను మభ్యపెట్టడం గతంలో చూశాం. జగన్ వచ్చిన తరువాత ఓ లెక్క.. రాకముందు ఓ లెక్క అన్నట్టుగా మ్యానిఫెస్టోను ఓ పవిత్ర గ్రంథంలా మార్చేశారు. మ్యానిఫెస్టో అంటే భగవద్గీత, బైబిల్, ఖురాన్ అని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన. అందుకే గత ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో 'నవరత్నాలు' చేర్చి.. మాట తప్పకుండా అమలుచేశారు. 2024లో నవరత్నాలకు మించి సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ మరోసారి పేదలకు సన్నిహితుడిగా జగన్ మారారు. శనివారం ఆయన విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోపై అన్నివర్గాల నుంచి సానుకూల స్పందన లభించింది.

అందరి సంక్షేమం కోరే వ్యక్తి



గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారు. పథకాలన్నీ పూర్తిస్థాయిలో అమలు చేసి నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడం వల్ల ఎంతో మంది పేదలకు మేలు జరిగింది. ఈసారి ప్రకటించిన మేనిఫెస్టో కూడా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా ఉంది. అందరి సంక్షేమం కోరే వ్యక్తి జగనన్న.

– కొర్రా కృష్ణమూర్తి, కామయ్యపేట, హుకుంపేట మండలం

స్కిల్ హబ్‌తో యువతకు మేలు



ఏజెన్సీలో స్కిల్ హబ్ ఏర్పాటు జరిగితే గిరిజన యువతకు మేలు జరుగుతుంది. అనేక మంది శిక్షణ ద్వారా మంచి ఉపాధి పొందే అవకాశం ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పెట్టారంటే కచ్చితంగా అమలు చేస్తారు. ఆయన పేదలకు మేలు చేసే నాయకుడు.

– భగవాన్, లాయర్, రంపచోడవరం

ఆయనపై పూర్తి విశ్వాసం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో చెప్పిన ప్రతీ మాట అమలు చేస్తారనే నమ్మకం మాకు ఉంది. వైఎస్సార్ చేయూత పథకం కొనసాగిస్తామని ప్రకటించడం మంచి నిర్ణయం. ఇది ఎంతో మంది పేదలకు ఉపయోగకరం. మళ్లీ జగన్ సీఎం అవుతారు. ఇచ్చిన హామీలు అమలు చేస్తారు.

– గుర్రాల భవాని, రంపచోడవరం

మరింత లబ్ధి చేకూరేలా..



నవరత్నాల పథకాల ద్వారా మరింత లబ్ధి చేకూరేలా మేనిఫెస్టో విడుదల చేయడం హర్షణీయం. చంద్రబాబు హామీలివ్వడమే తప్ప ఆయన అమలు చేసే పరిస్థితి లేదు. టీడీపీ జన్మభూమి కమిటీలతో రాష్ట్రాన్ని అవినీతిమయం చేశారు. సీఎం జగనన్న అవినీతికి తావులేకుండా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు.

– గౌరవ చిరంజీవినాయుడు, రైతు, ఎస్.కొత్తూరు, జి.మాడుగుల మండలం

జగన్ చెబితే అమలు చేసినట్టే



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాట ఇచ్చారంటే అది తప్పకుండా అమలు చేస్తారు. నెరవేరుస్తారు. గతంలో పింఛను పెంచుతానని ఇచ్చిన హామీని అందుకు తగ్గట్టుగా అమలుచేశారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారు. అంతకుముందు ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు.

– కేదారి బిన్నయ్య, రైతు, అప్పలరాజుపేట, రాజవొమ్మంగి మండలం

చేయూత కొనసాగింపు అభినందనీయం



డ్వాక్రా మహిళలకు సంబంధించి ఇచ్చిన హామీని చంద్రబాబు అమలు చేయలేదు. అప్పులు పాలైన తమను జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారు. ఆయన ప్రకటించిన మేనిఫెస్టోలో సున్నా వడ్డీ రుణాలు, చేయూత పథకాన్ని కొనసాగించడం వంటివి మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే కాకుండా ఆసరాగా నిలుస్తాయి.

– జి. లక్ష్మి, తాల్లబుతోట, సుజనకోట, ముంచంగిపుట్టు మండలం

రైతులకు ఎంతో మేలు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో తమలాంటి రైతులకు మేలు చేసేవిధంగా ఉంది. గతంలో రైతు భరోసా తమకు ఎంతో ఉపయోగపడింది. ఇప్పుడు అదే పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేస్తామని ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. ఆయన ప్రకటించారంటే ఆరు నూరైనా అమలు చేస్తారు.

– మదకం నాగరాజుదొర, గిరిజన రైతు, గంగవరం

జగన్‌బాబును నమ్ముతాం



చెప్పింది చేసే నాయకుడు జగన్‌బాబు. ఆయన్ని మాత్రమే నమ్ముతాం. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని నెరవేర్చారు. మాకు ఏ కష్టం లేకుండా ఇంటివద్దకు వలంటీర్ల ద్వారా పింఛను అందజేశారు. ఆయన చెప్పినవన్నీ చేశారు. ఆయన మళ్లీ అధికారంలోకి వస్తేనా మాలాంటి వారికి మరింత న్యాయం జరుగుతుంది.

– పాంగి సాధురాం, బొదిలిగూడ, ముంచంగిపుట్టు మండలం

చంద్రబాబువి బూటకపు హామీలు



చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలుచేయలేదు. జగనన్న ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. నాకు ఆసరా సొమ్ము 70 వేలకు పైగా వచ్చింది. నాబిడ్డ గోపిక మహికి నాలుగు విడతలు అమ్మ ఒడి అందింది.ఆసరా సొమ్ము జమ చేయడంతో టైలరింగ్, కూల్‌డ్రింక్ షాపు పెట్టుకున్నా.

– రాపేటి వీరలక్ష్మి, వై.రామవరం మండలం

జగన్ ఓ నమ్మకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకానికి ప్రతిరూపం. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి చూపించారు. చంద్రబాబు పింఛన్ పెంచుతామని చెబుతున్నా నమ్మేది లేదు. ఆయన ఇచ్చిన మాట తప్పిన సందర్భాలు చాలా ఉన్నాయి. హామీలను నెరవేర్చేది జగన్ ఒక్కరే.

– కొంటా చిట్టమ్మ, గుల్లేలు, పాడేరు మండలం

ప్రమాదబీమా పెంపుతో ఆసరా



ఆటో, మ్యాక్సీ క్యాబ్, టాక్సీ, టిప్పర్, లారీ డ్రైవర్లు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల బీమా అమలు ఎంతో మందికి ఆసరా. బ్యాంక్‌ల నుంచి వాహనాల కొనుగోలు చేసే వారికి వడ్డీ భారం తగ్గించేలా మ్యానిఫెస్టోలో పేర్కొనడం అభినందనీయం. సీఎం దూరదృష్టితో ప్రకటించారు.

– గంపరాయి సుబ్బారావు, ఆటో డ్రైవర్, పెద గుల్లేలు

చంద్రబాబును నమ్మేది లేదు



చంద్రబాబు నమ్మదగిన వ్యక్తి కాదు. 2014లో మేనిఫెస్టోలో అమలుగాని హామీలు ఇచ్చారు. వాటిలో ఏఒక్కటి కూడా నెరవేర్చలేదు. 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారు. నవరత్నాలతో పాటు ఇతర పథకాలను పేదలకు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుంది.

– సవలం దారయ్య, చూటూరు, చింతూరు మండలం

ప్రొటోకాల్ దర్శనాలు లేవు

• అంతరాలయ దర్శనాలూ రద్దు
• చందనోత్సవం రోజు సామాన్య భక్తులకు ప్రాధాన్యం
• కలెక్టర్ మల్లికార్జున

సింహాచలం: మే 10న సింహగిరిపై జరిగే వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేయనున్నట్టు కలెక్టర్ మల్లికార్జున చెప్పారు. ఆరోజు ఉదయం గంట మాత్రమే ఆచారం ప్రకారం దేవస్థానం ధర్మకర్తలు, దాతలు, జ్యుడీషియల్ వారికి అంతరాలయ దర్శన స్లాట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సింహగిరిపై శనివారం సాయంత్రం నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తితో కలిసి చందనోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జున వివరాలు వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో చందనోత్సవం రోజు ప్రొటోకాల్ దర్శనాలు రద్దు చేశామన్నారు. గతేడాది ట్రాఫిక్ సంబంధించి వచ్చిన లోటు పాట్లపై సమీక్షించిన మీదట కొండదిగువ పార్కింగ్ పాయింట్లు పెంచనున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టడానికి ఈ సారి 40 పెద్ద బస్సులతో పాటు మరో 40 మినీ బస్సులు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

పకడ్బందీగా పాస్‌లు, టికెట్ల జారీ

ఉద్యోగుల వెహికల్ పాస్‌లు లిమిటెడ్‌గా జారీ చేయడంతో పాటు దర్శన టికెట్లు పకడ్బందీగా రూపొందించనున్నట్టు తెలిపారు. టికెట్ రెండు దశల్లో చెక్ చేశాలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

భక్తులకు సౌకర్యాలు

క్యూలో ఉండే భక్తులు ఇబ్బంది పడకుండా 154 ప్రదేశాల్లో మంచినీరు అందించే ఏర్పాట్లు చేయనున్నట్టు వెల్లడించారు. అలాగే సేవా సంస్థలు, దేవస్థానం సహకారంతో పలు ప్రదేశాల్లో మజ్జిగ అందిస్తామన్నారు. గతేడాది ఎగ్జిట్ మార్గం నుంచి కూడా పలువురు వచ్చారని ఫిర్యాదులు రావడంతో ఆ ప్రాంతాల్లో ఒక ఐపీఎస్ అధికారి, రెవెన్యూ అధికారిని, దేవస్థానం అధికారిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దేవస్థానం ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థల వారికి రూ. 300 టికెట్ పెట్టి వారిని మధ్యాహ్నం 3 నుంచి 4గంటల లోపు రూ.1500 దర్శనం క్యూల్లో పంపించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 4 నుంచి 5గంటలకు విభిన్న ప్రతిభావంతులకు దర్శనం కల్పిస్తామన్నారు.

15 కిలో మీటర్ల మేర క్యూ లైన్లు

ఉచితదర్శనం క్యూతో పాటు రూ.300, రూ.1000, రూ.1500 టికెట్లు ఉంటాయన్నారు. మొత్తం 15కిలోమీటర్ల మేర క్యూలైన్లలో బారికేడింగ్, షామియనాలు వేయడంతో పాటు ప్రతీ చోటా సీసీ కెమెరాలు, పోలీస్ , దేవదాయశాఖ సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

టికెట్ల కుదింపు

గతసారి రూ.1000, రూ.1500 టికెట్లు పదివేల వరకు ఇచ్చామని, ఈ సారి 7వేలు మాత్రమే జారీ చేస్తామన్నారు. ఈసారి చందనోత్సవంకి లక్ష మందికిపైగా భక్తులు వస్తారని అంచనాతో ఏర్పాట్లు చేయనున్నట్టు చెప్పారు. మే 2 నుంచి 7వ తేదీలోగా టికెట్ల విక్రయాలు ముగిసేలా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఆన్‌లైన్‌తో పాటు కొన్ని బ్యాంకులు, దేవస్థానంలో టికెట్లు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అడిషినల్ కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీ సత్తిబాబు, నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులుపాల్గొన్నారు.

చందనోత్సవం రోజు అష్టోత్తరం పూజ

చందనోత్సవంరోజు పరోక్షంగా భక్తుల గోత్రనామాలతో అష్టోత్తరం పూజ నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. భక్తులు రూ. 1116 టికెట్ ఆన్‌లైన్‌లో తీసుకోవచ్చునని తెలిపారు. తొలి టికెట్ కలెక్టర్ మల్లికార్జున తీసుకుని అష్టోత్తరంపూజ టికెట్ల విక్రయాలు ప్రారంభించారు. పరోక్షంగా అష్టోత్తరం పూజ చేయించుకునే వారికి చందనం, ప్రసాదం పోస్టులో పంపించడం జరుగుతుందన్నారు. www.aptemples.ap.gov.inలో టిక్కెట్లు కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.

మొత్తం ఓటర్లు 7,71,193

• కొత్తగా చేరింది 9,938 మంది
• వీరిలో మహిళలే అధికం

సాక్షి, పాడేరు: జిల్లాలో కొత్తగా 9,938 మంది ఓటర్లు పెరిగారు. భారత ఎన్నికల కమిషన్ ఈఏడాది జనవరి 22న ఓటర్ల జాబితాను విడుదల చేసింది. అప్పటికి జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, అరకు నియోజకవర్గాల పరిధిలో 3,66,386 మంది పురుషులు, 3,94,832 మంది స్త్రీలు, ఇతరులు 37 మంది కలిపి 7,61,255మంది ఓటర్లు ఉన్నారు. అయితే ఎన్నికల కమిషన్ కొత్త ఓటర్ల నమోదుకు మరో అవకాశం ఇచ్చింది. ఈనెల 18వతేదీ వరకు కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 10,780 దరఖాస్తులను స్వీకరించారు. వాటిని సమగ్రంగా పరిశీలించిన అధికారులు 9,938 మందికి కొత్తగా ఓటు హక్కు కల్పించారు. దీంతో జిల్లాలో ఓటర్ల సంఖ్య 7,71,193కు పెరిగింది. వీరిలో పురుషులు 3,71,120, మహిళలు 4,00,034, ఇతరులు 39 మంది ఉన్నారు. పురుషుల కన్నా మహిళా ఓటర్లు 28,914 మంది అధికంగా ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా..: అరకులోయలో పురుషులు 1,19,429, మహిళలు 1,26,053, ఇతరులు 7,మొత్తం 2,45,489 మంది ఉన్నారు. పాడేరులో పురుషులు 1,19,790, మహిళలు 1,28,581, ఇతరులు 16మంది మొత్తం 2,28,387 మంది ఉన్నట్టు అధికారులు తెలిపారు.రంపచోడవరంలో పురుషులు 1,31,901, మహిళలు 1,45,400, ఇతరులు 16 మంది, మొత్తం 2,77,317 మంది ఉన్నట్టు వారు పేర్కొన్నారు.

• కొలువుల జాతర

జాబ్ మేళాలు 33 ఉద్యోగాలు 3,341

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమంతో పాటు ఉద్యోగాల కల్పనకు అధిక ప్రాధాన్యమిచ్చింది. మూడేళ్లలో జిల్లావ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ 33 జాబ్‌మేళాలు నిర్వహించగా 3341 మంది కొలువులు సాధించారు. ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడి వారిపై ఆధార పడిన కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు.

• సద్వినియోగం చేసుకున్న గిరిజన నిరుద్యోగ యువత
• మెరుగుపడిన ఆర్థిక పరిస్థితులు
• మారిన జీవన శైలి
• నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహణ



పాడేరులో జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువతీ,యువకులు (ఫైల్)

సాక్షి, పాడేరు: జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులకు జాబ్ మేళాలు వరంగా మారాయి. టెన్త్ ఆపై ఇతర ఉన్నత, సాంకేతిక, పారామెడికల్ విద్యను అభ్యసించిన నిరుద్యోగులకు ప్రైవేట్ సెక్టార్‌లో వేతనాలతో కూడిన ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ 2021 నుంచి జాబ్‌మేళాలను పెద్ద ఎత్తున నిర్వహించింది. కోవిడ్ కారణంగా రెండేళ్ల జాబ్‌మేళాలు నిలిచిపోయినా ఆ తరువాత కొనసాగించింది. ఈ మూడేళ్లలో 33 జాబ్‌మేళాలు ద్వారా 3341మంది గిరిజన నిరుద్యోగులకు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించింది.

జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నిర్వహించిన జాబ్‌మేళాలను గిరిజన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకున్నారు.ఈ ఉద్యోగాలతో వారి జీవన విధానం మారడమే కాకుండా ఆర్థిక భరోసా ఏర్పడింది. అపోలో ఫార్మసీ, మదర్ అండ్ ఫాదర్ నర్సింగ్ సర్వీసెస్, ఎస్‌బీఐ కార్డ్స్, వరుణ్ మోటార్స్, పేటీఎం సర్వీసెస్, దక్కన్ కెమికల్స్, అరబిందో ఫార్మా స్యూటికల్స్, హెటిరోడ్రగ్స్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్టు, ఎంఎస్ఎన్ ల్యాబరేటరీస్, మోహన్ స్పిన్‌టెక్స్, మెడ్‌ప్లస్, ముత్తుట్ ఫైనాన్స్, యోకోహామ టైర్స్ తదితర కార్పొరేట్ కంపెనీల్లో మంచి వేతనాలతో కూడిన కొలువులు పొందారు.

• హోటల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ పొందిన వారికి విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలోని పలు స్టార్ హోటళ్లలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉద్యోగాలు కల్పించింది. మంచి వేతనాలతో కూడిన ఉద్యోగాలు కావడంతో ఆ పోస్టులకు కూడా గిరిజన అభ్యర్థులు పోటీపడ్డారు.

• జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకున్న అభ్యర్థులంతా తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో ఉద్యోగాల్లో చేరి మంచి ఉన్నతమైన జీవనాన్ని సాగిస్తున్నారు. వారి కుటుంబాలకు కూడా ఆర్థిక వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లోని యువతీ, యువకులు కూడా జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకున్నారు ప్రస్తుతం పలు కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్న గిరిజన యువతీ, యువకులంతా ఉద్యోగాలు చేస్తు సంతోషంగా జీవిస్తున్నారు.

• 2021-22లో 13 జాబ్‌మేళాలు నిర్వహించగా 2006 మంది, 2022-23లో 7 జాబ్‌మేళాలు నిర్వహించగా 607 మంది, 2023- 24లో 13 జాబ్‌మేళాలు నిర్వహించగా 738 వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. మొత్తంమ్మీద 33 జాబ్ మేళాలు ద్వారా 3341 మంది కొలువులు సాధించారు.

పేరొందిన కంపెనీల్లో ఉద్యోగాలు



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రైవేటు సెక్టార్లలోను మంచి ఉద్యోగాల భర్తీకి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేసింది. తెలుగు రాష్ట్రాల్లో అనేక పేరొందిన కంపెనీల్లో మంచి జీతాలతో కూడిన ఉద్యోగాల ఖాళీలను గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేశాం.ఉద్యోగాలు పొందిన వారంతా నాణ్యమైన ఉచిత సౌకర్యాలతో సంతోషంగా జీవిస్తున్నారు. రూ.11వేల నుంచి రూ.21వేల వరకు వేతనాలు పొందుతున్నారు.

– ప్రశాంత్‌కుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, పాడేరు

అన్ని ఉచిత సౌకర్యాలతో కొలువు



అరకులోయలో గత ఏడాది నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా తిరుపతిలోని పార్చున్ కెన్సెస్ స్టార్ హోటల్‌లో రిసెప్షన్ సెక్షన్‌లో మంచి ఉద్యోగం పొందాను.అన్ని ఉచిత సౌకర్యాలతో ఉద్యోగం బాగుంది.అన్ని కటింగ్‌లు పోను నెలకు రూ.14,500 వేతనం చెల్లిస్తున్నారు. దీనిలో రూ.10వేల వరకు ప్రతి నెలా ఇంటికి పంపిస్తున్నాను. తల్లిదండ్రులకు వ్యవసాయమే జీవనాధారం. ప్రతినెలా పంపుతున్న నగదు వారి ఆర్థిక అవసరాలను తీరుస్తోంది.

– సీహెచ్, ఇమ్మానుయేల్, పెదబయలు

చంద్రబాబును ఇంకా నమ్మి మోసపోలేం

• వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు స్పష్టీకరణ
• పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తనూజారాణి, మత్స్యలింగం



టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న అరకు ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు తనూజారాణి, మత్స్యలింగం, శోభ హైమావతి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

అనంతగిరి: చంద్రబాబు నమ్మి మళ్లీ మోసపోకూడదనే ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామని పలువురు టీడీపీ నేతలు ప్రకటించారు. ఆ పార్టీకి చెందిన మండలంలోని జీనబాడు పంచాయతీ మాజీ ఎంపీటీసీ సలుగు దేముడమ్మ, పెదకోట పంచాయతీ మాజీ ఎంపీటీసీ అభ్యర్థి జన్ని ఈశ్వరరావు, రేగులపాలెం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, అరకు పరిశీలకురాలు శోభ హైమావతి, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ 2019లోని జగనన్న మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీను నేరవేర్చి, మీ కుటుంబానికి మంచి జరిగితేనే తనకు ఓటు వేయండి అంటూ ప్రజలకు వద్దకు ధైర్యంగా వచ్చారన్నారు. అదేవిధంగా టీడీపీ 2014లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలుచేయలేదని ప్రశ్నించారు. జగనన్న మాట ఇస్తే మాటతప్పడని నమ్మి, టీడీపీ నేతలు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. సర్పంచ్‌లు సిరగం గణేష్, సిరగం అన్నపూర్ణ, సలుగు మాధవి, పాగి అప్పారావు, ముత్యాలమ్మ, సన్యాసిరావు, సింహాద్రి, భీమలమ్మ, ఎంపీటీసీలు శ్రావణి, వెంకటలక్ష్మి, టి.మితుల, అశోక్, తాటినాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీతోనే భవిష్యత్తు

ఎటపాక: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీతోనే పేదవాడి భవిష్యత్తు సాధ్యమని రంపచోడవరం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శనివారం ఎటపాక మండలంలోని కుసుమనపల్లి, గొమ్ముకొత్తగూడెం, గోగుబాక, బుట్టాయిగూడెం, బొట్లకుంట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డికి దక్కుతుందన్నారు. పాలన పేదల చెంతకు చేర్చి సంక్షేమ పథకాలను ఇంటికి అందించి పేదల గుండెల్లో జగనన్న ఉన్నారన్నారు. రానున్న కాలంలో ఇంతకుమించిన సంక్షేమం, అభివృద్ధి చేసేలా మేనిఫెస్టోను ఆయన ప్రకటించారన్నారు. అమలుకాని హామీలతో ఓటు కోసం వచ్చే టీడీపీ, బీజేపీ, జనసేన నేతలకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సర్పంచ్‌లు మోసం దుర్గాలక్ష్మి, పండ కామేశ్వరరావు, ఉపసర్పంచ్ గోళ్ల నరేష్, ఎంపీటీసీ అంజలి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పసుపులేటి లక్ష్మణరావు, సచివాలయాల మండల కన్వీనర్ గోసు ప్రశాంత్, పార్టీ మండల కన్వీనర్ తానికొండ వాసు, ఉపాధ్యక్షులు, ఆకుల వెంకటరామారావు, జిల్లా కార్యదర్శి దామెర్ల రేవతి, అప్పలరెడ్డి, మోసం కన్న తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఒకరు మృతి- ఇద్దరికి గాయాలు



ఘటన స్థలంలో మృతి చెందిన మోహన్‌రావు

హుకుంపేట: ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డుంబ్రిగుడ మండలం లైగండ గ్రామానికి చెందిన కిల్లో మోహన్‌రావు(60) హుకుంపేట మండలంలోని గడుగుపల్లి గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తూ గడుగుపల్లి గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా సంతారి వైపు నుంచి హుకుంపేట వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మోహన్‌రావు అక్కడికక్కడే మృతి చెందగా, కాగా బైక్ నడుపుతున్న జి.మాడుగుల మండలం సొలొబోమ్ గ్రామానికి చెందిన కిల్లో ప్రకాష్, భీమవరం గ్రామానికి చెందిన నైని తెల్లన్నలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు 108 కు సమాచారం అందించగా క్షతగాత్రులను పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సతీష్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి

అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం



మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, వేదికపై అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి

అనంతగిరి: మారుమూల గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకుందామని, అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు.. మండలంలోని పెదకోట పంచాయతీ కేంద్రంలో శనివారం సర్పంచులు సిరగం గణేష్, సిరగం అన్నపూర్ణ ఆధ్వర్యంలోని బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, పార్టీ ఎన్నికల పరిశీలికురాలు శోభ హైమావతి, జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ మండలంలోని శివారు గ్రామాల్లోనూ అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు విడుదల చేసిందన్నారు. జగనన్న ప్రభుత్వం సచివాలయం, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, టవర్ల నిర్మాణం, రోడ్లు, తాగునీటికి అధిక ప్రాధాన్యతనిచ్చిందన్నారు. పెదకోట- కివర్ల వరకు తారురోడ్డు మరమ్మతుకు కృషి చేస్తామని మరిన్ని మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మించి, గిరిజనులకు రవాణా సదుపాయం మరింత మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. గిరిజనులు అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తామన్నారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, వైస్ ఎంపీపీ శకుంతల, నాగేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ గంగన్నదొర, ప్రధాన కార్యదర్శులు డానియేలు, లక్ష్మణ్‌రావు, జేసీఎస్ కన్వీనర్ నవీన్, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ గంగులు, రాంబాబు, మధుసూదన్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవాలు



శిశువును తల్లికి అప్పగిస్తున్న 108 సిబ్బంది

మారేడుమిల్లి: మండలంలోని మద్దివీడు గ్రామానికి చెందిన బి.సన్యాసమ్మ అనే గర్భిణికి శనివారం పురిటినొప్పులు రావడంతో గ్రామస్తులు 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సన్యాసమ్మకు నొప్పులు ఎక్కువ అవడంతో 108 ఈఎంటీ వెంకటేశ్వరరావు, పైలెట్ నాగేశ్వరరావు పురుడుపోశారు. ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. అలాగే మండలంలోని తేనెలమామిడి గ్రామానికి చెందిన సాదల రాజకుమారి గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో 108 సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో బోదులూరు పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో రాజకుమారికి ఈఎంటీ వెంకటేశ్వరరావు, పైలెట్ నాగేశ్వరరావు పురుడు పోశారు. ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆయాచోట్ల తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్టు వారు చెప్పారు. ఒకే రోజులో ఇద్దరు గర్భిణులకు 108 సిబ్బంది పురుడు పోశారు.

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం, ఒకటి నుంచి ఏడు వరకు స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం.పోలినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి ఒకటి నుంచి ఏడో స్థాయీ సంఘాల సమావేశాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశాలకు సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



గ్రామస్తులకు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు

- పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు
- సీఎం విడుదల చేసిన మేనిఫెస్టోపై ప్రచారం

కొయ్యూరు: మహిళల స్వయం ఉపాధికి మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చారని పాడేరు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు పేర్కొన్నారు. శనివారం ఆయన బూదరాళ్ల, మర్రివాడ పంచాయతీల్లో పర్యటించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ఐదేళ్లలో పాలన అందించిన ఆయన రాబోయే ఐదేళ్లలో అంతకుమించి ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. రైతులు,మహిళలు, పిల్లలను బడికి పంపే తల్లులకు ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిని చేసేందుకు గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. ఒక వైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమాన్ని సమన్వయం చేసి పాలన అందించారన్నారు. అమలు కాని హామీలిచ్చి మరోసారి ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ నేతలు వస్తున్నారని, వారిని ఏమాత్రం నమ్మి మోసపోవద్దన్నారు. పేదల పక్షాన నిలబడిన ఈ ప్రభుత్వం పెత్తందారులతో చేస్తున్న యుద్ధంలో ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉండాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా తనూజారాణిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఆయన కోరారు. ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ జె.రాజులమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ఆర్.ముసిలినాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుమర్ల సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ బండి సుధాకర్, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి ఎం.గోవర్ధన గిరి, ట్రైకార్ డైరెక్టర్ సుర్ల లోవరాజు, ఎంపీటీసీలు అప్పారావు, గంగాభవాని, కుమారి, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

రెప్పపాటులో విషాదం

- వెదుళ్లపాలెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- టైరు పేలి కంటైనర్ లారీని ఢీకొన్న కారు
- ముగ్గురు దుర్మరణం, ఒకరికి గాయాలు
- మృతులు విశాఖ నగరవాసులు



ప్రమాదానికి గురైన కారు, చిక్కుకున్న మృతదేహాలు



మృతురాలు వెంకటలక్ష్మి (ఫైల్)



మృతుడు దాడి గగన్ (ఫైల్)



మృతుడు మధుకర్ (ఫైల్)

నక్కపల్లి : వారు ప్రయాణిస్తున్న కారు యమదూతలా మారింది.. టైరు రూపంలో యమపాశం విసిరింది.. జాతీయ రహదారిపై వెదుళ్లపాలెం వద్ద జరిగిన ఘోర ప్రమాదం రెప్పపాటులో ముగ్గురి ప్రాణాలు హరించింది. రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. వివరాలివి. జీవీఎంసీ 91వ వార్డు గవరవీధి, ఎన్ఏడీ జంక్షన్, కూర్మనపాలెం ప్రాంతాలకు చెందిన నలుగురు కారులో శనివారం ఉదయం కాకినాడ బయలు దేరారు. శరగడం వెంకటలక్ష్మి (37) తన కొడుకు వికాస్, మేనమామ కొడుకు దాడి గగన్ (15)లతో కలిసి వ్యక్తిగత పని మీద కారులో ప్రయాణమయ్యారు. వీరితో పాటు వికాస్ స్నేహితుడైన సుంకర మధుకర్(27) బయలుదేరాడు. పాయకరావుపేటలో వెంకటలక్ష్మి తల్లిని చూసి అక్కడ నుంచి కాకినాడ వెళ్లాలనుకున్నారు. కారు వెదుళ్లపాలెం జంక్షన్ వద్దకు చేరుకునే సరికి హఠాత్తుగా టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతల రూట్లోకి దూసుకుపోయింది. తుని నుంచి విశాఖ వైపు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొట్టడంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జయింది. ఈ ఘటనలో కారులో ఉన్న వెంకటలక్ష్మి, దాడి గగన్, సుంకర మధుకర్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ప్రమాద తీవ్రతకు కారు టాప్ పైకి లేచిపోయింది. డోర్లు ఊడిపోయాయి. ప్రమాదంలో వికాస్ ప్రాణాలతో బయటపడ్డాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రెండు నెలల్లో జర్మనీ వెళ్లాల్సి ఉండగా....

వికాస్ స్నేహితుడైన మధుకర్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మెకానికల్ విభాగంలో అప్రెంటీస్ చేస్తున్నట్టు తెలిసింది. తుని ప్రాంతానికి చెందిన అతడు ఎన్ఏడీ జంక్షన్‌లో ఉంటున్నాడు. అతడు రెండు నెలల్లో ఉన్నత చదువు, ఉద్యోగం కోసం జర్మనీ వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. ఇంతలోనే మృత్యువు రోడ్డు ప్రమాద రూపంలో కబళించి అనంత లోకాలకు తీసుకెళ్లిపోయింది. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు హుటాహుటిన నక్కపల్లి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు దుర్మరణం పాలవడంతో విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని రోదించారు. కారులో చిక్కుకున్న మృతదేహాలను స్థానికుల సాయంతో పోలీసులు బయటకు తీసి పోస్టుమార్టం కోసం నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

గవరవీధిలో విషాదఛాయలు

గోపాలపట్నం: వెదుళ్లపాలెం జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో శరగడం వెంకటలక్ష్మి మృతి చెందగా ఆమె కుమారుడు వికాస్ గాయాలపాలవడంతో గవరవీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. గవరవీధిలో ఉంటున్న శరగడం నర్సింగరావు సప్లయర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో అతడి భార్య వెంకటలక్ష్మి మృతి చెందగా కుమారుడు వికాస్ గాయాలపాలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు, స్థానికులు పెద్ద ఎత్తున ఇంటికి తరలివచ్చి కన్నీరుమున్నీరయ్యారు. వెంకటలక్ష్మి అందరితో కలివిడిగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో మృతి చెందిన దాడి గగన్‌ది కూర్మన్నపాలెం కాగా.. శనివారం ఉదయం టోల్‌గేట్ వద్ద కారు ఎక్కాడు.

ఎన్నికల ప్రచారంలో ఏయూ ఉద్యోగులు





వంశీకృష్ణ ప్రచారంలో పాల్గొన్న ఏయూ హాస్టల్ ఉద్యోగి శ్రీనివాసరావు, ఏయూ సహకార సంఘం ఉద్యోగి దువ్వి మంగరాజు

డాబాగార్డెన్స్: నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారంలో ఏయూ ఉద్యోగులు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. జనసేన దక్షిణ నియోజకవర్గ అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఏయూ హాస్టల్ ఉద్యోగి జె.శ్రీనివాసరావు, ఏయూ సహకార సంఘం ఉద్యోగి దువ్వి మంగరాజు పాల్గొన్నారు. ప్రభుత్వ సంస్థలో పని చేస్తూ ఓ రాజకీయ పార్టీకి మద్దతుగా వీరిద్దరూ ప్రచారం చేయడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడానికి పలువురు సిద్ధమయ్యారు. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.